# ప్రేమోన్మాదం ప్రాచీనమే



*అసదృశ చిత్తే దేవరే*
*శుద్ధమనాః ప్రియతమే విషమశీలే*
*నకథయతి కుటుంబ*
*విఘటిత భయేన తనుకాయతే స్నుషా*

***భావం:*** శుద్ధమైన మనస్సుగల ఇంటి కోడలు మరిది చెడ్డ మనస్సు కలవాడు కాగా, భర్త కోపిష్టి కాగా కుటుంబం విచ్ఛిన్నమౌతుందన్న భయంతో బయటకు చెప్పుకోలేక కృశించిపోతోంది.

నేడు స్త్రీలకు రక్షణ లేదన్న విషయాన్ని నిత్యం వార్తాపత్రికలలో చదువుతున్నాం. ఎవరో ఒక మగవాడు ఒకఅమ్మాయిని ప్రేమించాననుకుని ఆమెను వెంటాడి వేధించడం, అతనిలో ఉన్మాదం ఎక్కువైనప్పుడు ఆమెపై యాసిడ్ పొయ్యడం, కత్తితో పొడవడం, బెదిరించి బలవంతంగా ఎత్తుకు పోవడం వార్తలుగా వస్తున్నాయి. మగవారిలో ఉన్మాదం పెరగడానికి నేటి సినిమాలూ, టెలివిజన్, ఇంటర్నెట్ కారణమంటున్నారు. స్త్రీలు మగవారిని రెచ్చకొట్టేలా ప్రవర్తిస్తున్నారనీ అక్కడక్కడ వాదం వినిపిస్తోంది. ప్రాచీన భారతదేశంలో స్త్రీని గౌరవించేవారనీ, ప్రస్తుతమున్న పోకడలకి పాశ్చాత్య విధానాలే కారణమనే విషయంలో మాత్రం ఏకాభిప్రాయమున్నట్లే కన్పిస్తోంది.

అయితే ఈ మాట నిజమేనా? సీతా, ద్రౌపదీ, దమయంతీ వంటి ఎందరో స్త్రీలు అవమానాలపాలు కాలేదా? మహావీరులైన భర్తలుండడంవల్ల వారికి చివరకు రక్షణ లభించింది. సామాన్య స్త్రీల సంగతేమిటి? యాభై, అరవై ఏళ్ళనాడు స్త్రీలకు చదువుకునే అవకాశంలేదు. గడపదాటే పరిస్థితి లేదు. ఆనాటి స్త్రీలందరూ హాయిగా ఉన్నారా? అక్కచెల్లెళ్లు పుట్టింటికి వస్తే మేనకోడళ్ళపై అత్యాచారం చేసే మేనమామలూ, మరదళ్ళ చెయ్యి పట్టుకునే బావలూ, వితంతువులైన కోడళ్ళను వాడుకున్న మామగార్లూ యాభైఏళ్ళనాడు కూడా ఉన్నారు. ఆనాటి స్త్రీలకు పైకి చెప్పుకునే అవకాశం కూడా లేదు. చెడిపోయిందన్నముద్ర ఆమెమీదే పడుతుందికదా.

అటువంటి నిస్సహాయ పరిస్థితిలో ఉన్న స్త్రీ కథే పై శ్లోకంలో ఉంది. కొత్తగా కాపురానికి వచ్చిననాడే భర్త ఆమెతో "నీ మానప్రాణాలను రక్షించవలసిన బాధ్యత నాది. నీకు అవమానం చేసిన వాడిని నరికి పోగులు పెడతాను' అన్నాడు. అత్తమామలు కూతురిలా చూసుకుంటున్నారు. అంతాహాయిగా ఉందనుకుని ఆమె నిశ్చింతగా ఉన్నప్పుడు మరిది విద్యాభ్యాసం పూర్తిచేసుకుని వచ్చాడు.

ఆమె కష్టాలు మొదలయ్యాయి. ఆమె స్నానం చేస్తున్నప్పుడు రహస్యంగా చూడడం, ఆమెను తాకడం వంటి ఇబ్బందులు మొదలయ్యాయి. అక్కడతో ఆగుతుందా? భర్తతో చెప్తే ఏమవుతుంది? వేరు కాపురం పెడతాడా? తల్లి తండ్రుల్లాంటి అత్తమామలకి దూరమవడం ఇష్టం లేదు. మరిదిని చంపి భర్త హత్యా నేరం కింద శిక్షింపబడితే ఇంకా కష్టం. ఏం చెయ్యాలో పాలుపోక ఆమె కృశించి పోసాగింది.

ఎందరో అమ్మాయిలు పైకి చెప్పుకోలేక, చెప్పుకున్నా ప్రయోజనముంటుందన్న నమ్మకం లేక కృశించిపోయారు, పోతూనే ఉన్నారు. పత్రికలలో వచ్చేది, ఇంగ్లీషులో చెప్పాలంటే "టిప్ ఆఫ్ ది ఐస్ బెర్గ్" మాత్రమే. సమస్యకి శాశ్వత పరిష్కారానికి ప్రయత్నం కావాలి.

******